క్లుప్తంగా

వేమన పద్య పోటీలు



పద్య పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: స్థానిక కేజీబీవీలో వేమన పద్య, వ్యాసపద్య సుమార్చన పోటీలను ప్రిన్సిపాల్ ప్రమీల అధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తెలుగు అధ్యాపకురాలు లలితారెడ్డి పర్యవేక్షణలో బాలికలు వేమన పద్యాలను ఆలపించారు. గెలుపొందిన బాలికలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



రైతులకు సూచనలిస్తున్న జేడీ త్రినాథస్వామి

ఎచ్చెర్ల క్యాంపస్: రైతులు మినప, పెసర పంటల తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ జేడీ కె.త్రినాథస్వామి అన్నారు. తమ్మినాయుడుపేట పరిధిలో మినప, పెసర సాగు వ్యవసాయ పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. దిగుబడి పెరిగేందుకు మల్టీ కే వంటి పోషకాల ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి నూర్పు పూర్తిచేసిన రైతులు ధాన్యం అమ్మకం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ బి.రజిని, ఏవో వై.సురేష్, ఏఈవో అరుణ మణి పాల్గొన్నారు

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



విద్యార్థులను పరీక్షిస్తున్న దృశ్యం

జి.సిగడాం: ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రీయ బాల స్వాస్థత(ఆర్‌బీఎస్‌కే) జిల్లా పోగ్రాం అధికారి డాక్టర్ ఇప్పిలి వెంకట్, డీఈఐసీ మేనేజర్లు డి.అప్పలరాజు, పి.అప్పారావు అన్నారు. మండలంలోని కొత్తపెంట యూపీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై బుధవారం ఆరా తీశారు. గ్రామస్థాయిలో పని చేస్తున్న వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి వైద్య సేవలను అందించాలన్నారు. ఎవరైనా అనారోగ్యంతో ఉంటే సంబంధిత జిల్లా, మండల అస్పత్రులకు తరలించాలన్నారు. అనంతరం డాక్టర్ బుడుమూరు యశ్వంత్, హెచ్ఎం మజ్జి మదన్‌మోహన్ సమక్షంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివప్రసాదరావు, హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఏఎన్ఎం జి.భవానీ, ఎంఎల్‌హెచ్‌పీ ఎ.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న డీఈవో తిరుమల చైతన్య

శ్రీకాకుళం: విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమలచైతన్య ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న ఈఎండీపీ ఫెసిలిటేటర్ శిక్షణ కార్యక్రమంలో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్యక్రమాన్ని నిర్దేశించిన పాఠశాలలో అమలు జరిపే బాధ్యత ఫెసిలిటేటర్‌పై ఉందన్నారు. కార్యక్రమ ఉద్దేశాలు, శిక్షణ లక్ష్యాలను ప్రాజెక్టు జిల్లా మేనేజర్ ఎ.అనూష వివరించారు. శిక్షణ అనంతరం ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు తగిన నైపుణ్యాభివృద్ధి కల్పించి, మార్చిలో నిర్వహించనున్న ఎక్స్‌పోకు ప్రాజెక్టులను సిద్ధం చేయాలని సూచించారు. శిక్షణలో 40 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రిగ్స్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రణస్థలం: మండల కేంద్రంలోని జేఆర్‌పురం హైస్కూల్లో ఉత్సాహంగా జోనల్ స్థాయి గ్రిగ్స్ పోటీలు బుధవారం కొనసాగాయి. రెండోరోజు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో జరిగాయి. ఎంఈవో ఎ.త్రినాథరావు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.రమణయ్య, పీఈటీ, పీడీ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రమణ, గ్రిగ్స్, నీట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఆర్.మాధవరావు, ఎస్.సూరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరటి సాగు.. లాభాలు బాగు..!

- తగిన జాగ్రత్తలతో అధిక దిగుబడి
- అంతర పంటగా సైతం సాగు
- ఎచ్చెర్లలో సుమారు 1,500 ఎకరాల్లో సాగు



ఎచ్చెర్ల మండలం కుప్పిలిలో అంతరపంటగా సాగు చేస్తున్న అరటి



లావేరు మండలం మురపాకలో సాగు చేస్తున్న అరటిపంట

ఎచ్చెర్ల: భారతీయ సాంస్కృతి, సాంప్రదాయాలతో అరటి ముడిపడి ఉంది. అరటిపండు లేకుండా ఏ శుభకార్యం జరగదనే చెప్పవచ్చు. అంతేకాకుండా నిత్య జీవితంలోనూ అరటి ఒక భాగమైపోయింది. అరటిపండులోని ఆహార, ఆరోగ్య విలువల వలన దానిని అమృత ఫలం అంటారు. ప్రతిరోజూ ఒక అరటి పండు తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు. ఇన్ని ప్రయోజనాలు ఉన్న అరటికి మంచి డిమాండ్ ఉండటంతో రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని అన్ని మండలాలు అరటి సాగుకు అనుకూలమైన నేలలుగా ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ఇక్కడ రైతులు అరటి తోటలు పెంపకంపై ఎక్కుగా మక్కువ చూపుతున్నారు. నియోజకవర్గంలో సుమారు 1,500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

అనుకూల వాతావరణం

అరటికి నీరు ఇంకిపోవు గుణం కలిగిన సారవంతమైన నేలలు మిక్కిలి అనుకూలం. ఉదకజని సూచిక 6.5 నుంచి 7.5 ఉన్న భూములు చాలా అనుకూలం. అంతే కాకుండా అరటి ఉష్ణ మండల పంట. కావున 10 డిగ్రీల నుంచి 40 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వరకూ మంచి దిగుబడి వస్తుంది. అధిక చౌడు, ఆమ్లశాతం ఉన్న భూమిలో పనామా-మాడు తెగులు వచ్చే అవకాశం ఉంటుంది.

మొక్కలు నాటే విధానం

అరటి మొక్కలు ఎకరానికి 1,235 నుంచి 1,280 వరకు నాటాలి. గుంత నుంచి వచ్చిన మట్టికి 5 కిలోల పశువుల ఎరువు, అరకిలో వేపపిండి, 300 గ్రామల సూపర్ ఫాస్పేట్ ఎరువు, 30 గ్రాముల లిండెన్‌పొడి మందు చేర్చి బాగా కలియబెట్టి గుంత నింపి అనంతరం మొక్కను నాటాలి.

అంతర పంటలకు అనుకూలం

అరటితోట అంతర్ పంటలకు అనుకూలంగా ఉంటుంది. అరటి సాగులో అంతర పంటలుగా వేరుశనగ, ఆలనంద, పసుపు, అల్లం, ఉల్లి, వెల్లుల్లి, అనాస, ఆకుకూరలు, క్యారెట్, కాలీఫ్లవర్, క్యాబేజీ వేసుకుని లాభాలు సాధించవచ్చని అధికారులు సూచిస్తున్నారు. అంతేకాకుండా దీర్ఘకాలిక పంటలైన మామిడితోటల్లోనూ ఈ అరటిసాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు. అయితే అంతర పంటలకు అరటితో సంబంధం లేకుండా ఎరువులు అదనంగా ఇవ్వాలి. అరటిసాగుకు ఎక్కువగా నీరు అవసరం కానీ నీరు నిల్వ ఉండకూడదు. కాబట్టి రైతులు డ్రిప్ పద్ధతిలో నీరు కట్టడం ఉత్తమం. అంతేకాక ఫర్టిగేషన్ పద్ధతిలో ఎరువులు వేస్తే అరటి చెట్లు అధిక దిగుబడులు ఇస్తాయి. అయితే అరటిలో తల్లి చెట్టుకు సరైన పోషకాలు అందుబాటులో ఉంచడం, బలంగా ఉంచడానికి అంతరకృషి చాలా ముఖ్యం.

సస్యరక్షణ చర్యలు

కాండం తొలుచు పురుగు నివారణకు పూత రాక ముందు మోనోక్రోట్ పాస్ ఇంజెక్షన్ ఇవ్వాలి. ముక్కు పురుగు దుంపలో వలయాకారపు బొరియలు చేసి దుంప కుళ్లిపోయేలా చేస్తుంది. దీని నివారణకు ఒక్కో మొక్కకు 25 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలను చెట్టు మొదళ్లలో వేసి మట్టితో కప్పి నీరు పెట్టాలి. నులి పురుగులు చెట్టు వేళ్లను ఆశిస్తే ఆకులు నల్లగా మాడిపోతాయి. దీని నివారణకు వేపపిండి 200 గ్రాములు, 100 గ్రాముల వీఏఎం కలిపి ఒక్కో మొక్కకు వేయాలి. ఆకులపై మొట్టమొదట చిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడి క్రమేపి వివిధ దశల్లో ఆకులు పూర్తిగా రాలిపోతాయి. దీని నివారణకు మాంకోజెట్ 2.5 గ్రాములు, క్లోరోథాలోనిల్ 2 గ్రాములను ఒక్క లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పేను బంక వల్ల వైరస్ తెగుళ్లు ఆశించి మొక్కల్లో పెరుగుదల ఆగకుండా ఏసిఫేట్ 1.5 గ్రాములు ఒక్క లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

మెలకువలు ముఖ్యం

అరటి సాగు చేసే రైతులు అధికారులు సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. అరటి పంటను డ్రిప్ పద్ధతిలో సాగు చేయడం ఉత్తమం. అరటిని మామిడి తోటల్లో అంతరపంటగానూ, అరటితోటలో వివిధ పంటలను అంతర పంటలుగాను సాగు చేసుకోవచ్చు.

– సుదర్శిని, ఉద్యానవన శాఖాధికారి, ఎచ్చెర్ల

సహస్ర దీపాలంకరణ



బ్యాంకర్స్ కాలనీలో సహస్ర దీపాలంకరణ సేవ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నారాయణ తిరుమలలో ఆలయ అర్చకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సహస్ర దీపాలంకరణ సేవ బుధవారం జరిగింది. అలాగే బ్యాంకర్స్ కాలనీలోని శివ బాలాజీ ఆలయంలో అర్చకులు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో సహస్ర దీపాలంకరణ సేవ చేపట్టారు. ఈ సందర్భంగా గోదాదేవి మంగళ శాసన పాశురం జరిగింది. కోదండ రామాలయంలో అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో దీపాలను వెలిగించి పాశు పఠనం చేపట్టారు. అలాగే డీసీసీబీ కాలనీలోని భూ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు చామర్తి గోపాలాచార్యులు పాశుర పఠనాన్ని చేసి దీపారాధనలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నారాయణ తిరుమలలో దీపారాధనలో మహిళలు



దీపాలతో మహిళలు



కోదండ రామాలయంలో దీపారాధనలు



నారాయణ తిరుమలలో సహస్ర దీపాలంకరణ సేవ



చిన్న బజారులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో...



హాజరైన భక్తులు

పరామర్శ



కుశాలపురంలో వరహాలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని తమ్మినాయుడుపేట పంచాయతీ బెండివానిపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎన్ని ధనుంజయ అన్న చెల్లయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ తమ్మినేని సీతారాం బుధవారం పరామర్శించారు. ఆ కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరావు, భాస్కరరావు, పద్మజ, హరికృష్ణ, రామారావు, సూర్యనారాయణ, భోగారావు తదితరులు పాల్గొన్నారు.



చెల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తమ్మినేని

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఎచ్చెర్ల మండలంలోని పలువురిని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. బెండివానిపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎన్ని ధనుంజయ అన్న చెల్లయ్య, కుశాలపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పైడి అమ్మినాయుడు, చందు, మురళి తల్లి వరహాలమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో ఈ కుటుంబాలను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సనపల నారాయణరావు, సూర అప్పారావు, సీపాన ఎర్రంనాయుడు, బాడాన దేవభూషణరావు, కోటిపాత్రుని హరికృష్ణ, ఎన్ని అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములు నాయుడు సేవలు చిరస్మరణీయం



రణస్థలం: శ్రీరాములు నాయుడు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీరాములునాయుడు విగ్రహానికి నివాళులర్పిస్తున్న తూర్పుకాపు నాయకులు

రణస్థలం: నీతిగల రాజకీయాలు చేసి, సిక్కోలు చరిత్రలో చెరుగని ముద్రవేసిన దివంగత గొర్లె శ్రీరాములు నాయుడు సేవలు చిరస్మరణీయమని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. గొర్లె శ్రీరాములునాయుడు 20వ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు నెలకొల్పి జిల్లాను సస్యశ్యామలం చేయడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. మడ్డువలస రిజర్వాయర్ నిర్మాణంలో చెరగని ముద్రవేశారని కొనియాడారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పలు క్రియాశీలక రాజకీయ పదవులు అలంకరించినా గర్వం లేకుండా వ్యవహరించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రణస్థలం ఎంపీపీ ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, నాయకులు కురిటి రామకోటి, కోటపాలెం సర్పంచ్ గొర్లె జగదీష్, పిల్ల ఆనంద్ పాత్రుడు, మహంతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపు కీర్తి పతాకం శ్రీరాములునాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దివంగత గొర్లె శ్రీరాములు నాయుడు తూర్పుకాపుల కీర్తి పతాకమని తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, గౌరవ అధ్యక్షుడు వావిలాపల్లి జగన్నాథంనాయుడు అన్నారు. నగరంలోని కిమ్స్ రోడ్డులో శ్రీరాములునాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పట్లో జీవో అంటే గొర్లె ఆర్డర్ అని ప్రతి ఒక్కరికీ తెలిసిన నానుడి అన్నారు. ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, సంఘం పూర్వపు అధ్యక్షుడు కొమ్ము రమణమూర్తి, సలాన చిరంజీవి, న్యాయవాది వాన కృష్ణచంద్, మామిడి విష్ణు, సింగుపురపు రవికుమార్, వాడవలస సురేష్ కుమార్, కీర్తి సుశీల, మాదాసి సంతోష్ తదితరుల పాల్గొన్నారు.

ప్రయాణ పాట్లు



బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సు

శ్రీకాకుళం అర్బన్: విశాఖపట్నంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభ బుధవారం నిర్వహించారు. అయితే ఆ సభకు కూటమి ప్రభుత్వం ఆర్టీసీ బస్సులు వేయడంతో జిల్లా ప్రజలకు ప్రయాణ తిప్పలు తప్పలేదు. జిల్లాలోని నాలుగు డిపోలైన శ్రీకాకుళం ఒకటో డిపో నుంచి 70 బస్సులు, శ్రీకాకుళం రెండో డిపో నుంచి 69 బస్సులు, టెక్కలి డిపో నుంచి 45 బస్సులు, పలాస డిపో నుంచి 48 బస్సులు ప్రధాని సభకు తరలించడంతో ఆయా డిపోల పరిధిలోని రూట్లలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమయానికి బస్సులు లేకపోవడంతో ఉన్న బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. దీంతో కొంతమంది ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి వారి గమ్యస్థానాలకు చేరుకున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులు, విద్యార్థులు బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక దూరప్రాంత ప్రయాణికుల పరిస్థితి వర్ణించలేనిది. నాన్‌స్టాప్ బస్సులు కూడా ప్రయాణికుల రద్దీకి తగ్గట్లు లేకపోవడంతో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అసలే పండగ సీజన్ కావడంతో సుదూర ప్రాంతాల నుంచి మారుమూల గ్రామాలకు తరలి వెళ్లేందుకు సామాగ్రితో చేరుకున్న ప్రయాణికులు అనేక అవస్థలు పడ్డారు. ఆయా రూట్లలో తిరిగే బస్సులు కాంప్లెక్స్‌లోని పోర్టికోకి వచ్చిన వెంటనే ప్రయాణికులు ఎక్కేందుకు ఇబ్బందులు పడ్డారు.

దివ్యాంగ పింఛన్ల తనిఖీ



తండ్యాలపేటలో తనిఖీలు నిర్వహిస్తున్న వైద్య బృందం

గార: మండలంలోని శ్రీకూర్మం పంచాయతీలో మంచంపై ఉన్న దివ్యాంగ పింఛన్ లబ్ధిదారుని వద్ద బుధవారం వైద్య బృందం తనిఖీలు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ సుధీర్, శ్రీకూర్మం పీహెచ్‌సీ వైద్యాధికారి వీవీఎస్ఎన్. మూర్తి, ఈవో ప్రభాకర్ తదితరుల బృందం తండ్యాలపేటకు చెందిన గొలివి సింహాచలం ఇంటికి వెళ్లి వివరాలు సేకరించింది. మంచంపైనే చికిత్స తీసుకోవడం, నడుము నుంచి కింద భాగమంతా స్పందన లేకపోవడాన్ని గుర్తించారు. వత్సవలస పంచాయతీలో మరో పింఛన్‌దారు ఎస్.సీతారామరాజు వివరాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కుర్మాన పల్లవి, ఏఎన్ఎం బి.రుక్మిణి, ఆశ కార్యకర్త జి.లక్ష్మీ పాల్గొన్నారు.

చోరీలపై సమగ్ర విచారణ

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో పలు దొంగతనాలతో సంబంధం ఉన్న పాత నేరస్తుడు పున్నాన రాంబాబు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పోలీస్ స్టేషన్ నుంచి విచారణ సమయంలో గత నెల 31న ఇతను తప్పించుకున్నాడు. విజయవాడ చేరుకొని ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు ప్రత్యేక నిఘాపెట్టి కొన్ని రోజులు క్రితం అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ వ్యక్తి చేసిన దొంగతనాలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం పట్టణం, రూరల్, ఆమదాలవలస, సరుబుజ్జిలి వంటి ప్రాంతాల్లో ముఖ్యంగా జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రామాలు లక్ష్యంగా దొంగతనాలు చేసినట్లు సమాచారం. గతంలో ఫిర్యాదు చేయని వారు సైతం ప్రస్తుతం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. చోరీ జరిగినట్లు బాధితులకు కూడా తెలియకుండా దొంగతనాలు చేయడంలో ఇతను సిద్ధహస్తుడు. ఈ క్రమంలో అతను చెప్పిన వివరాల ప్రకారం ఆయా ఇళ్లకు వెళ్లి పోలీసులు వివరాలు తెలుసుకుంటున్నట్లు సమాచారం.

యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గంలో సిక్కోలుకు పెద్దపీట

శ్రీకాకుళం న్యూకాలనీ: యూటీఎఫ్ రాష్ట్ర నూతన కార్యవర్గంలో శ్రీకాకుళం జిల్లాకు పెద్దపీట వేశారు. రాష్ట్ర కార్యదర్శిగా సంపతిరావు కిషోర్ కుమార్, కోశాధికారిగా రెడ్డి మోహనరావులు ఎన్నికయ్యారు. కాకినాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) 17వ రాష్ట్ర మహాసభల్లో యూటీఎఫ్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరి ఎన్నికపై జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.బాబూరావు, బగాది శ్రీరామ్మూర్తి, చౌదరి రవీంద్ర, ఎండ ఉమాశంకర్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా జట్టుకు మురళీకృష్ణ ఎంపిక



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి అండర్-12 బాలురు క్రికెట్ జట్టుకు బిర్లంగి మురళీ కృష్ణ ఎంపికయ్యాడు. శ్రీకాకుళం రూరల్ పరిధిలోని వాకలవలస గ్రామానికి చెందిన మురళీకృష్ణ ఇటీవల జరిగిన సెలక్షన్ మ్యాచ్‌ల్లో రాణించడంతో తుది జట్టుకు ఎంపికయ్యాడు. దీంతో ఏసీఏ నార్త్‌జోన్ క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు తిరుపున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

సంక్రాంతికి వెళ్లొస్తాం



నిరంతరం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు సంక్రాంతి పండుగ కోసం సొంతిళ్లకు పయనమయ్యారు. శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ)కి ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ముందుగానే ఔట్ పాస్‌లు తీసుకొని ఇళ్లకు వెళుతున్నారు. ఈ సందర్భంగా క్యాంపస్ వద్ద సందడి వాతావరణం నెలకొంది.

– ఎచ్చెర్ల క్యాంపస్

సంక్షిప్తంగా...

పది మంది దాడి చేశారని ఫిర్యాదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామానికి చెందిన సీపాన దిలీప్‌కుమార్ అనే వ్యక్తి తనపై పది మంది దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుశాలపురం గ్రామం బైపాస్ సమీపంలో ఉన్న తన అక్క ఇంటికి వెళ్తుండగా, మంగళవారం రాత్రి పప్పల విద్యాసాగర్‌తో పాటు మరో తొమ్మిది మంది దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీకాకుళం రిమ్స్‌లో ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. మెడికల్ రిపోర్టు ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవు'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, దీనికి అందరూ సహకరించాలని మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.సుధీర్‌కుమార్ అన్నారు. నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్లో ప్లాస్టిక్ రైడ్ నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్‌ను సీజ్ చేసి దుకాణదారులకు రూ.14 వేల జరిమానా విధించారు. నగరంలో వ్యాపారులు, ప్రజలంతా ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులు వాడాలని, చికెన్, మటన్ షాపులకు స్టీల్ కప్పులు తీసుకెళ్లాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులు వాడినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు లహరి ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని హయాతీనగరంలోని ఏపీఎంజేపీ బీసీఆర్‌డబ్ల్యూ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని ఎం.లహరి ప్రతిభ కనబర్చింది. జిల్లాస్థాయి రంగోత్సవం 2024-25 పోటీల్లో ఉత్తమ నినాదం తయారీలో మొదటిస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి అభినందించారు.

బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు

జి.సిగడాం: గ్రామాల్లో పండగ సందర్భంగా ఎవరైనా బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని రణస్థలం సీఐ ఎం.అవతారం హెచ్చరించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో, కూడళ్లలో ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ఆయా పోలీసు సిబ్బందితో దాడులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలన్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

మండలంలోని నడిమివలస కూడలి వద్ద ఈనెల 7న బాతువ గ్రామానికి చెందిన కలిశెట్టి పైడిరాజు అక్రమంగా తరలిస్తున్న 435 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. వీటి విలువ రూ.56 వేలు ఉంటుందని చెప్పారు. పైడి రాజును బుధవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు. ఆయనతో పాటు ఏఎస్ఐ కోరుకొండ రామకృష్ణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

క్షేత్రస్థాయి శిక్షణతో విద్యార్థులకు మేలు

శ్రీకాకుళం న్యూకాలనీ: వృత్తి విద్య కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు క్షేత్రస్థాయిలో శిక్షణతో మేలు జరుగుతుందని ఇంటర్మీడియట్ విద్య శ్రీకాకుళం జిల్లా వృత్తివిద్యాశాఖ అధికారి (డీవీఈవో) శివ్వాల తవిటినాయుడు పేర్కొన్నారు. వృత్తివిద్య కోర్సుల అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం ఏటా ఆన్ ద జాబ్ ట్రైనింగ్ నిర్వహించాలని సంబంధిత అధ్యాపకులకు సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేట అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ విద్యార్థులకు బుధవారం శ్రీకాకుళంలో నిర్వహించిన ఒకరోజు ఆన్ ద జాబ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆయన దగ్గరుండి పరిశీలించారు. పాఠశాల, జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్ కార్యాలయంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సరుకుల సరఫరా, వివిధ రకాల ఆహార వంటల తయారీ విధానం, పంపిణీ, అకౌంటింగ్ పుస్తకాల నిర్వహణ తదితర అంశాలపై సంస్థ మేనేజర్ వెంకటరాజు విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కలిగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి, జిల్లా ఏజీఎంఓ, లైబ్రేరియన్ తాతారావు, అక్షయపాత్ర సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సదస్సులెందుకు..?

జి.సిగడాం: ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు ఎటువంటి ఫలితాలు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. మండల కేంద్రంలో రెవెన్యూ సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులు పుప్పాల జగదీశ్వరరావు, వెలిది బాబాలు అధికారులను ప్రశ్నించారు. తమ జిరాయితీ భూమిని డీ-పట్టాగా నమోదు చేశారని, దానిని పరిష్కారం చేయాలని ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేడన్నారు. గతంలో జరిగిన గ్రామసభలోనే కాకుండా జిల్లా అధికారులకు సైతం ఫిర్యాదు చేశామన్నారు. ఈ సమస్యపై రీసర్వే డీటీ కొత్తపల్లి గాయత్రి మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే ఈ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అబోతుల రాధ, వీఆర్వో సీతయ్య, సర్వేయర్ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.